క్లుప్తంగా

పారా లీగల్ వలంటీర్ల నియామకానికి దరఖాస్తులు

నర్సీపట్నం: పారా లీగల్ వలంటీర్ల నియామానికి ఔత్సాహికుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి పి.షియాజ్ ఖాన్ తెలిపారు. ప్రజలకు న్యాయపరమైన సలహాలు, న్యాయం చేయాలనే ఆలోచన ఉన్న వారు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థులు దరఖాస్తుతో పాటు ఆధార్ జెరాక్స్, విద్యార్హత, పాస్ ఫొటోను మండల లీగల్ సర్వీస్ కమిటీకి అందజేయాలన్నారు. కనీస విద్యార్హత పదో తరగతి, వివిధ సేవా సంస్థల్లో పని చేసిన వారికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఎటువంటి జీతం కానీ, పారితోషికం ఉండదని, సేవా దృక్పథంతో పని చేయాలన్నారు.

రూ.14 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం

మాకవరపాలెం: మండల కేంద్రం మాకవరపాలెంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మండల కేంద్రం నుంచి పి.పి.అగ్రహారం వెళ్లే రోడ్డు కింది వీధి ప్రాంతంలో అధ్వానంగా మారింది. ఈ నేపథ్యంలో ఇటీవల రూ.14 లక్షలు మంజూరు కావడంతో సోమవారం నుంచి సీసీ రోడ్డు పనులు చేపట్టారు.

టైలరింగ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మాకవరపాలెం: టైలరింగ్‌లో శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ(నాక్) ఏడీ రవికుమార్ సోమవారం తెలిపారు. మండల కేంద్రంలోని నాక్ శిక్షణ కేంద్రంలో రెండు నెలల పాటు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. ఏడు, ఆపై చదువుకున్న మహిళలు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 77802 75922 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

దివ్యాంగ పింఛన్ల తనిఖీ



మాడుగులలో దివ్యాంగ పింఛన్ లబ్ధిదారులను తనిఖీ చేస్తున్న వైద్య సిబ్బంది

మాడుగుల: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎంపీడీవో కొంకి అప్పారావు ఆధ్వర్యంలో సోమవారం దివ్యాంగ పింఛన్ల తనిఖీ చేపట్టారు. మాడుగుల పట్టణంలో 16, మండలంలోని 16 గ్రామాల్లో 58 పింఛన్‌దారులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్థోపెడిక్ వైద్య నిపుణుడు కృష్ణమూర్తి, జనరల్ ఫిజీషియన్ అరుణ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రామాలయంలో ప్రత్యేక భజనలు



మన్యపురట్ల రామాలయంలో భజన చేస్తున్న భక్తులు

నాతవరం: మండలంలో మన్యపురట్లలో రామాలయం నిర్మాణం చేపట్టి 13 ఏళ్లు పూర్తయిన సందర్భంగా 24 గంటల పాటు మహిళలు భజనలు చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 5 వేల మందికి అన్నదానం ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు మాజీ సర్పంచ్ వనిమిన సూర్యారావు, పాల కేంద్రం అధ్యక్షుడు వి.శ్రీను, ఆలయ కమిటీ సభ్యులు ప్రసాదం అందజేశారు.

జనవరి 27ను ఎలక్ట్రీషియన్ డేగా గుర్తించాలి



ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఎలక్ట్రీషియన్లు

నర్సీపట్నం: జనవరి 27ను ఎలక్ట్రీషియన్ డేగా గుర్తించాలని కోరుతూ శ్రీ విజయలక్ష్మి దుర్గ ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం ఆర్డీవో వి.వి.రమణకు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయానికి చేరుకుని జనవరి 27న ఎలక్ట్రిషన్ డేగా గుర్తించాలని నినాదాలు చేశారు. ఎలక్ట్రీషియన్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహం అందించాలని వారు వినతిపత్రంలో కోరారు.



కళాశాల అందుబాటులో ఉన్న ఫిజిక్స్ ల్యాబ్



కె.కోటపాడులో సొంత భవనాలతో నడుస్తున్న ఇంటర్మీడియెట్ కళాశాల

ప్రాక్టికల్స్ ఇక్కడ.. పబ్లిక్ అక్కడ.!

- కె.కోటపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల అవస్థలు
- పబ్లిక్ పరీక్షలకు ఏడేళ్లుగా సబ్బవరం కళాశాలకు వెళ్తున్న పరిస్థితి
- 50 కిలోమీటర్ల మేర ప్రయాణించాల్సి వస్తుందని విద్యార్థుల ఆవేదన
- కె.కోటపాడులోనే పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి

కె.కోటపాడు : కె.కోటపాడులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు పబ్లిక్ పరీక్షల సమయంలో సుదూర ప్రయాణం సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. స్థానికంగా పరీక్ష కేంద్రం లేక ఇబ్బందులు పడుతున్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులకు చెందిన మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 121 మంది ఉన్నారు. ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలను ఇక్కడి కళాశాలలోనే నిర్వహిస్తున్నారు. పబ్లిక్ పరీక్షల కోసం మాత్రం పరీక్ష కేంద్రంగా సబ్బవరం జూనియర్ కళాశాలను కేటాయిస్తున్నారు.

రూ.2.50 కోట్లతో భవనాల నిర్మాణం

కె.కోటపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రూ.2.50 కోట్లతో సొంత భవనాల నిర్మాణం పూర్తయ్యాయి. 2022లో అప్పటి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఈ భవనాల ప్రారంభోత్సవం కూడా చేశారు. ప్రస్తుతం ఈ భవనాల్లో విద్యార్థులకు తరగతులతో పాటు ప్రత్యేకంగా ల్యాబ్‌లను ఏర్పాటు చేసి సైన్స్ గ్రూపులకు ప్రయోగాలు కూడా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ద్వితీయ సంవత్సరం బైపీసీ, ఎంపీసీ విద్యార్థులకు ఫిబ్రవరి 10 నుంచి 20 వరకూ ప్రాక్టికల్ పరీక్షలను కె.కోటపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనే నిర్వహించనున్నారు. మొదటి, ద్వితీయ సంవత్సరం ఇంటర్ విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలను మాత్రం సబ్బవరంలో నిర్వహించనున్నారు. ఇప్పటికైనా కె.కోటపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షల నిర్వహణకు అందుబాటులో ఉన్న మౌలిక వసతులను ఉన్నతాధికారులు గుర్తించి స్థానికంగా పరీక్ష కేంద్రం కేటాయించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.



కళాశాలలో విద్యార్థులకు తరగతుల నిర్వహణ

ఏడేళ్లుగా తప్పని పాట్లు

కె.కోటపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2016–17 విద్యా సంవత్సరం వరకూ పబ్లిక్ పరీక్షలు నిర్వహించారు. అప్పట్లో ఉన్న భవనాలు శిథిలావస్థకు చేరడడంతో పాటు పరీక్షల నిర్వహణకు కావాల్సిన మౌలిక వసతులు లేని కారణంగా 2017–18 విద్యా సంవత్సరం నుంచి సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంగా ఈ కళాశాల విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. కె.కోటపాడు నుంచి సబ్బవరానికి పరీక్షల సమయంలో విద్యార్థులు వెళ్లి రావాలంటే 50 కిలోమీటర్ల మేర ప్రయాణం చేయాల్సి వస్తుంది. కె.కోటపాడు నుంచి సబ్బవరానికి బస్సు సదుపాయం లేకపోవడంతో రెండు బస్సులు మారి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది మొదటి సంవత్సరం పరీక్షలు 63 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలు 61 మంది విద్యార్థులు రాయనున్నారు. వీరిలో దివ్యాంగ విద్యార్థులు 14 మంది ఉన్నారు. దివ్యాంగ విద్యార్థులు కూడా సబ్బవరం పరీక్ష కేంద్రానికి వెళ్లి రావాలంటే తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితులు ఉన్నాయి.

2 గంటలు ప్రయాణించాల్సి వస్తోంది..



కె.కోటపాడు నుంచి సబ్బవరం పరీక్ష కేంద్రానికి వెళ్లాలంటే పరీక్ష సమయానికి రెండు గంట ముందుగానే బయలుదేరాల్సిన పరిస్థితి ఉంది. సబ్బవరానికి కె.కోటపాడు నుంచి నేరుగా బస్సులు లేవు. రెండు బస్సులు మారి వెళ్లాల్సి ఉంది. పరీక్షల సమయంలో విద్యార్థులపై ఒత్తిడి ఏమీ ఉండకూడదు. దీనికి తోడు ప్రతి క్షణం విలువైనదే. కానీ మాకు సబ్బవరంలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. మా కళాశాలలోనే పరీక్షలు నిర్వహిస్తే బాగుంటుంది. సుదూరం ప్రయాణించడం వల్ల పరీక్ష ఫలితాలపై ప్రభావం పడుతుంది. – పి.హాసిని, బైపీసీ, ద్వితీయ సంవత్సరం, కె.కోటపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల

ఉన్నతాధికారుల దృష్టికి పరీక్ష కేంద్రం సమస్య



ఇంటర్మీడియట్ బోర్డు అధికారులతో పాటు ఎమ్మెల్యే బండారు దృష్టికి కె.కోటపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఎదుర్కొంటున్న పరీక్ష కేంద్రం సమస్యను తీసుకెళ్లాం. ప్రస్తుతం కళాశాలలో పరీక్షల నిర్వహణకు భవనాలు అందుబాటులో ఉన్నాయి. ఫర్నిచర్, ల్యాబ్స్, తాగునీరు, మరుగు, మూత్రశాలలు ఉన్నాయి. కళాశాలలో 9 మంది గెస్ట్ అధ్యాపకులు, ఇద్దరు కాంట్రాక్ట్ అధ్యాపకులు ఉన్నారు. స్థానికంగా ఉన్న కె.కోటపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనే పరీక్షలను నిర్వహించాలని కోరుతున్నాం.
– ఎస్.నాగమణి, ప్రిన్సిపాల్, కె.కోటపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల

పరిష్కార వ్యవస్థలో 18 ఫిర్యాదులు



అర్జీలను స్వీకరిస్తున్న ఆర్డీవో వి.వి.రమణ

నర్సీపట్నం: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో వచ్చిన అర్జీలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆర్డీవో వి.వి.రమణ పేర్కొన్నారు. సోమవారం నిర్వహించిన పరిష్కార వ్యవస్థలో 18 ఫిర్యాదుల వచ్చాయని తెలిపారు. వీటిలో ఎక్కువగా భూ సమస్యలు, పింఛన్లు, పారిశుధ్యం, తాగునీటిపై ఎక్కువగా ఫిర్యాదులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బూడి కృషితో బోయిలకింతాడకు భారీగా నిధుల మంజూరు



ట్యాంక్ నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్న సర్పంచ్ బూరె బాబూరావు

దేవరాపల్లి: గత ప్రభుత్వ హయాంలో అప్పటి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చొరవతో బోయిలకింతాడ పంచాయతీకి భారీగా రూ. 1.80 కోట్లు జలజీవన్ మిషన్ నిధులు మంజూరు చేశారని స్థానిక సర్పంచ్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబూరావు తెలిపారు. ఈ నిధులతో బోయిలకింతాడలో 60 వేల లీటర్ల సామర్థ్యంతో మంచినీటి ట్యాంక్ నిర్మాణాన్ని పూర్తి చేసి, ఇంటింటికి కుళాయిలు సైతం ఏర్పాటు చేశామన్నారు. పంచాయతీ శివారు బి.కొత్తూరులో మంచినీటి ట్యాంక్ నిర్మాణానికి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కె.చంద్రశేఖర్‌తో కలిసి సోమవారం స్థల పరిశీలన చేశారు. తక్షణమే పనులు ప్రారంభించాలని కాంట్రాక్టర్‌కు సర్పంచ్ సూచించారు. తాగునీటికి శాశ్వత పరిష్కారం చూపిన మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుకు గ్రామస్తుల తరపున ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

పాడి రైతులను ప్రోత్సహించేందుకు లేగ దూడల ప్రదర్శన



లేగ దూడల ప్రదర్శనను తిలకిస్తున్న వైద్యులు సౌజన్య, రాంబాబు



తునివలసలో పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ హేమ

నర్సీపట్నం: పాడి రైతులను ప్రోత్సహించేందుకు లేగ దూడల ప్రదర్శన ఏర్పాటు చేశామని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ పశు వైద్యురాలు డాక్టర్ సౌజన్య అన్నారు. పశు వైద్య శిబిరాల్లో భాగంగా సోమవారం మండలంలో అమలాపురం గ్రామంలో లేగ దూడల ప్రదర్శనతో పాటు పశువైద్య శిబిరం నిర్వహించారు. లేగదూడల ప్రదర్శనను జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ డాక్టర్ సౌజన్య, నర్సీపట్నం సహాయ సంచాలకుడు డాక్టర్ రాంబాబు పరిశీలించారు. జెర్సీ, హెచ్ఎఫ్, ముర్ర వంటి వివిధ జాతులకు చెందిన 55 పెయ్యలను ప్రదర్శనలో ఉంచారు. వైద్యులు మూడు ఉత్తమ పెయ్యలను ఎంపిక చేశారు. ప్రథమ బహుమతి మాకిరెడ్డి పోతురాజు, ద్వితీయ బహుమతి కచ్చాల నరసింహమూర్తి, తృతీయ బహుమతి పైల వరహాల బాబుకు అందజేశారు. ఆడ దూడలు మాత్రమే పెటించే కృత్రిమ గర్భధారణ వీర్య కణాల సాంకేతికత గురించి వేములపూడి డాక్టర్ నరేష్ రైతులకు వివరించారు. ఈ శిబిరంలో 54 పశువులకు గర్భకోశ చికిత్సలు, 72 దూడలకు నట్టల నివారణ టీకాలు వేశారు. వేములపూడి వైద్యాధికారి డాక్టర్ నరేష్ వైద్య సేవలు అందించారు.

చీడికాడ: మండలంలోని తునివలస, బి.సింగవరం గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేశారు. పశువులు, పెయ్యిలు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు వేశారు. తునివలస సర్పంచ్ పడాల హేమ, బి.సింగవరం ఎంపీటీసీ పైలా ముత్యాల నాయుడు, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దేవరాపల్లి: వెంకటరాజుపురం, ముషిడిపల్లి గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలు జరిగాయి. వెంకటరాజుపురంలో సర్పంచ్ దాసరి సంతోష్‌కుమార్ పశు ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో మామిడిపల్లి పశువైద్యాధికారి జి.ప్రియాంక వైద్య సేవలందించారు. ముషిడిపల్లి శిబిరంలో ఎం.అలమండ పశు వైద్యాధికారి కె.మంజుషారాణి పశువులకు వైద్య పరీక్షలు చేశారు. గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందును తాగించారు. పౌల్ట్రీ కోళ్లకు టీకాలు వేశారు.

ధర్మశ్రీ పదవీ స్వీకరణకు తరలిరండి

బుచ్చెయ్యపేట: వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకుడిగా ఈ నెల 31న కరణం ధర్మశ్రీ ప్రమాణ స్వీకారం చేయనున్నారని, ఈ కార్యక్రమానికి అందరూ తరలిరావాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కె.అచ్చింనాయుడు ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ఉదయం 10 గంటలకు కొంకోటలో జరిగే ప్రమాణ స్వీకార మహోత్సవానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తరలిరావాలన్నారు.

పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్‌తో ఉపాధ్యాయులు, కౌన్సిలర్లు పద్మావతి, రాజేష్, సురేష్ కుమార్

నర్సీపట్నం: నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు నర్సీపట్నంకు చెందిన అల్లాడ చారిటబుల్ ట్రస్ట్ స్టడీ మెటీరియల్‌ను సమకూర్చింది. ఈ మెటీరియల్‌ను కౌన్సిలర్లు సిహెచ్.పద్మావతి, సిహెచ్.రాజేష్ చేతుల మీదగా ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు సోమవారం అందజేశారు. ట్రస్ట్ నిర్వాహకుడు అల్లాడ సురేష్ కుమార్ విద్యాభివృద్ధికి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో తురకబడి ఉపాధ్యాయులు ఐ.శ్రీనివాసరావు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గోవాడకు జోరుగా చెరకు తరలింపు



చెరకును తరలించేందుకు సిద్ధం చేస్తున్న రైతులు

కె.కోటపాడు : గోవాడ సుగర్ ఫ్యాక్టరీ క్రషింగ్ ప్రారంభం కావడంతో సాగులో ఉన్న చెరకు పంటను తరలించే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. ఫ్యాక్టరీలోని సభ్య రైతులకు ఫీల్డ్ సిబ్బంది కటింగ్ ఆర్డర్లను ఇప్పటికే మంజూరు చేస్తున్నారు. ఈ మేరకు సాగులో ఉన్న చెరకు పంటను ఫ్యాక్టరీకి తరలించే పనులను రైతులు జోరుగా చేపడుతున్నారు. ఈ ఏడాది గోవాడ సుగర్ ఫ్యాక్టరీ క్రషింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. ప్రస్తుతం క్రషింగ్ ప్రారంభం కావడంతో మద్దతు ధర రైతులు ఆశించనంత మేరకు లేకపోయినా తప్పనిసరి పరిస్థితిలో చెరకును ఫ్యాక్టరీకి తరలించే చర్యలు చేపడుతున్నారు. మరో వైపు కూలీలకు డిమాండ్ ఒక్కసారిగా పెరిగింది. చెరకు సాగుకు పెట్టుబడి పెరిగిన దృష్ట్యా ఫ్యాక్టరీ యాజమాన్యం మద్దతు ధరను పెంచాలని పలువురు రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లోనే ప్రసవాలు శ్రేయస్కరం



వి.సంతపాలెంలో ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి శైలజ

కె.కోటపాడు : గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనత సమస్యను అధిగమించవచ్చునని లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి శైలజ అన్నారు. వి.సంతపాలెం గ్రామంలో సోమవారం ఫ్యామిలీ ఫిజిషియన్ వైద్య పరీక్షలు నిర్వహించారు. 133 మందికి ఆరోగ్య పరీక్షలతో పాటు గర్భిణులకు తనిఖీలు నిర్వహించారు. గర్భిణులు ప్రసవాలను ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే నిర్వహించుకోవడం ద్వారా తల్లీబిడ్డల ఆరోగ్యం క్షేమదాయకమన్నారు. ప్రతి నెలా గ్రామంలో నిర్వహించే ఫ్యామిలీ ఫిజిషియన్ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వీ భాగ్యలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ పి.త్రినాథ్, ఎంఎల్‌హెచ్‌పీ మంగ, ఏఎన్‌ఎం పద్మ, పాల్గొన్నారు.

ముగిసిన గౌరీపరమేశ్వరుల ఉత్సవం



గంగాదేవి, పార్వతీదేవి, శివుడి వేషధారణలో కళాకారుల సందడి

రోలుగుంట: నిండుగొండలో గౌరీపరమేశ్వరుల ఉత్సవం సోమవారం రాత్రి ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా వీధులు విద్యుత్ దీపాల వెలుగులతో కళకళలాడాయి. ఆదివారం రాత్రి పలు నేల డ్యాన్స్‌లు, జనపద, పౌరాణిక నృత్యాలు, కోలాటల నడుమ గౌరీపరమేశ్వరులను ఊరేగించారు. బాణసంచా కాల్చారు. సర్పంచ్ శెట్టి సంధ్య, మాజీ ఎంపీపీ సత్యనారాయణమూర్తి, వెంకటరాజారావు, నారాయణమూర్తి భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేశారు.

మల్లాంలో ప్రత్యేక హోమాలు



హోమంలో పాల్గొన్న దంపతులు

బుచ్చెయ్యపేట: మండలంలోని మల్లాం గ్రామంలో విశ్వజ్ఞానుల విజ్ఞాన విహార క్షేత్రంలో పిరమిడ్ ధ్యాన మందిరంలో సోమవారం దంపతులతో ప్రత్యేక హోమాలు నిర్వహించారు. సంతానం లేని దంపతులతో ధాన్య కేంద్రంలో హోమాలు చేసి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయా దంపతులకు డాక్టర్ వర ప్రసాద్ హోమియో మందులు అందజేశారు. విజయనగరానికి చెందిన దుర్గా మహాపీఠం ఉత్తర పీఠాధిపతులు శ్రవణ చైతన్యానంద స్వామి, సంస్థ నిర్వాహకుడు ఆనందకుమార్, తదితరులు పాల్గొన్నారు.

సందడిగా గుర్రాలు, ఎడ్ల బళ్ల పోటీలు



జిల్లా స్థాయి పోటీల్లో దౌడుతీస్తున్న గుర్రం

చోడవరం: అంకుపాలెం గ్రామంలో శ్రీదుర్గాంబిక అమ్మవారి పండగ ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి గుర్రాల పోటీలు, ఎడ్లబళ్ల పరుగు పోటీలు హోరాహోరీగా జరిగాయి. గుర్రాల పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి 18 గుర్రాలు పాల్గొన్నాయి. ఎడ్ల బళ్లు 24 ఈ పోటీల్లో పాల్గొన్నాయి. విజేతలకు నగదు, ప్రోత్సాహక బహుమతులు ఉత్సవ కమిటీ ప్రతినిధులు అందజేశారు. మరో పక్క రాష్ట్రస్థాయి మహిళల కబడ్డీ పోటీలు, జిల్లా స్థాయి పురుషుల కబడ్డీ పోటీలు మూడో రోజు జరిగాయి. మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, పార్లమెంటు పరిశీలకుడు ధర్మశ్రీ పోటీలను తిలకించారు. రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా ముందస్తు ప్రణాళిక



బోరు పనులు ప్రారంభిస్తున్న వెంకటరమణ

నాతవరం: వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా బోరు ఏర్పాటు చేశామని పెదగొలుగొండపేట సర్పంచ్ వెంకటరమణ అన్నారు. పెదగొలుగొండపేటలో సోమవారం బోరు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జల్‌జీవన్ మిషన్ పథకం పనులు పూర్తయితే ఇంటింటికి తాగునీటి సరఫరా చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు తమరాన సత్యనారాయణ, గ్రామ పెద్దలు రాంబాబు, దొరబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

31న జాబ్ మేళా

దేవరాపల్లి: దేవరాపల్లిలో ఈ నెల 31న జాబ్ మేళా జరగనుంది. జాబ్ మేళా ఏర్పాటుకు అనువైన స్థలాన్ని ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా ప్లేస్‌మెంట్ ఆఫీసర్ పి.శ్రీనివాస్ సోమవారం పరిశీలించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాబ్ మేళా నిర్వహించేందుకు స్థానిక హైస్కూల్ హెచ్‌ఎం, మండల విద్యాశాఖ అధికారి–1 బి.పడాల్‌దాస్, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తితో కలిసి చర్చించారు.

ఇరువర్గాల ఘర్షణలో ముగ్గురిపై కేసు

మాకవరపాలెం: రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ముగ్గురిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ దామోదర్‌నాయుడు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పైడిపాల దళితవాడకు చెందిన కసిపల్లి యేసురత్నం డ్వాక్రా రుణ వాయిదా చెల్లించలేదు. దీంతో గ్రూపు సభ్యులు ఆదివారం సాయంత్రం వెంటనే వాయిదా నగదు చెల్లించాలని అడిగారు. ఇదే విషయమై ఈ కాలనీలో ఉన్న పురం లోవరాజు(37) నగదు సకాలంలో చెల్లించకపోతే ఎలా అని ప్రశ్నించడంతోపాటు దుర్భాషలాడాడు. ఈ విషయాన్ని మహిళ ఇంటికివెళ్లి తన కుమారులు శివాజీ, అభిలకు తెలియజేసింది. దీంతో ఈ ఇద్దరు లోవరాజుపై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. అలాగే లోవరాజు చేసిన దాడిలో శివాజీ(24), అభి(21)లకు గాయాలు కావడంతో ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. లోవరాజును చికిత్స నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కు తరలించామన్నారు.

వచ్చే నెల 8 నుంచి దేవితల్లి తీర్థం

దేవరాపల్లి: మండల కేంద్రం దేవరాపల్లి గ్రామ ప్రజల ఆరాధ్య దైవం ఉమామహేశ్వరీ దేవి (దేవితల్లి) తీర్థం వచ్చే నెల 8 నుంచి 12 వరకు ఘనంగా నిర్వహించాలని గ్రామపెద్దలు తీర్మానించారు. ఈ మేరకు ఉమామహేశ్వరీ దేవి ఆలయంలో గ్రామ పెద్దలు సోమవారం సమావేశమయ్యారు. ఐదు రోజుల పాటు వైభవంగా జరిగే మహోత్సవాలను ప్రజలంతా విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, ఆలయ ధర్మకర్త వరదపురెడ్డి లలితా ప్రసాద్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బెల్టు షాపుల కారణంగా పెరిగిన అత్యాచారాలు



మాట్లాడుతున్న సీపీఎం నేత వెంకన్న

దేవరాపల్లి: గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం బెల్టు షాపులను ఏర్పాటు చేయడంతోనే మహిళలు, బాలికలపై అత్యాచారాలు, దాడులు అధికమయ్యాయని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న విమర్శించారు. ఈ మేరకు మండల కేంద్రం దేవరాపల్లిలో సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. గ్రామాల్లో ప్రతి పాన్ షాపు, టీ దుకాణాల్లో సైతం మద్యం అన్ని వేళల్లో అందుబాటులో ఉంటుందన్నారు. బాలురు సైతం మద్యం సేవించి ఆ మత్తులో అత్యాచారాలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. యలమంచిలి మండలంలో 20 రోజుల వ్యవధిలో ఇద్దరు బాలికలపై అత్యాచారాలు జరగడమే ఇందుకు నిదర్శనమన్నారు. బెల్టు షాపులను అరికట్టాల్సిన అధికారులు మామ్ముళ్ల మత్తులో నిద్ర పోతున్నారని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు అరికట్టడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. కూటమి నాయకులే దగ్గరుండి కోళ్ల పందెం, పేకాటను ఆడిస్తున్నారని, ఇలాంటి వ్యవస్థలో మహిళలు, బాలికలకు రక్షణ ఎలా కల్పిస్తారని ఆయన ప్రశ్నించారు. ఇంతటి దౌర్భాగ్యపు పరిస్థితి మునుపెన్నడూ లేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాలలో బెల్టు షాపులను నివారించాలని వెంకన్న డిమాండ్ చేశారు.

పది మోడల్ టెస్ట్ పేపర్ల ఆవిష్కరణ

మాకవరపాలెం: యూటీఎఫ్ రూపొందించిన పదో తరగతి మోడల్ టెస్ట్ పేపర్లను ఎంఈవో పి.ఎస్.ఎన్.మూర్తి సోమవారం స్థానిక ఉన్నత పాఠశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ఈ పేపర్లను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉత్తమ మార్కులు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం అచ్యుతరామయ్య, యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి జి.అప్పలరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మోదమాంబకు వెండి వస్తువుల బహూకరణ



వెండి వస్తువులు అందజేస్తున్న దాతలు

మాడుగుల రూరల్: మండలంలో ఎం.కోడూరు మోదమాంబ అమ్మవారికి గ్రామానికి చెందిన గాలి వెంకట ఈశ్వర అప్పారావు, సర్వలక్ష్మి దంపతులు, గాలి గంగాధర్‌కుమార్, రామలక్ష్మి దంపతులు అర కిలో చొప్పున వెండి వస్తువులను సోమవారం బహూకరించారు. సర్పంచ్ గొల్ల విల్లి సంజీవిరావుకు ఈ వెండిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాసశర్మ, సహకార సంఘం మాజీ అధ్యక్షుడు పడాల అప్పలనాయుడు, ఎంపీటీసీ సభ్యుడు ముమ్మిన రమణబాబు, తదితరులు పాల్గొన్నారు.